# ప రీ క్ష!

వైస్ ఛాన్స్లర్ రామ్‌దేవ్ ఎయిర్ కండిషన్ రూమ్‌లా, ప్రకృతి చల్లగా ఆహ్లాదకరంగావుంది. మేస్టర్ల రాజకీయాలతో, విద్యార్థుల స్ట్రయికులు, ధర్నాలతో, గుమస్తాల, అధికారుల లంచాలతో విషపూరితమైన యూనివర్శిటీ కేంపస్ వాతావరణంలా రామ్‌దేవ్ మనసు చికాకుగా వేడిగా వుంది.

జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో గొప్ప మేధావిగా గుర్తింపు వచ్చాకనే రామ్‌దేవ్ ప్రతిభను ప్రభుత్వం గుర్తించింది. ఆ విశ్వవిద్యాలయానికి వుపాధ్యక్షుడిగా నియమించింది. అస్తవ్యస్తంగా వున్న ఆ విశ్వవిద్యాలయ వ్యవహారాలను చక్కబర్చమంది.

రామ్‌దేవ్ చిన్నప్పటినుంచి అనేక ఆదర్శాలున్నవాడు. ఆచరణశీలి. వీలైనంతలో విద్యా విధానాన్ని చక్కబరుద్దామన్న సదాశయంతోనే కొత్త వుద్యోగంలో చేరేడు. కానీ విశ్వవిద్యాలయంలో ఎన్నెన్ని రాజకీయాలు? అయినా పట్టుదల వదలకుండా తనకు మంచిదని తోచింది చేస్తూనే వున్నాడు. అది ఆయన స్వభావం. ఫలితంగా ఆయనకు శాంతి కొరవయింది. సమస్యల సుడిగుండంలో పడిపోతున్నానన్న భావన అంకురించింది.

ఆరోజు వచ్చిన టపాని చూస్తున్నాడు రామ్‌దేవ్. తనకు వచ్చిన వుత్తరాలన్నింటినీ క్షుణ్ణంగా చదివే అలవాటు ఆయనకు. కాని యీ అరు

నెలల్లో ఆయన వుత్తరాల్ని అక్కడక్కడా చూచి సంతకం పెట్టటం నేర్చు కోక తప్పలేదు.

అలా అక్కడక్కడా చూస్తుండగా ఆ వుత్తరంలో పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాసిన మాటలు అతని దృష్టిని ఆకర్షించాయి. మరోసమస్య! ఎయిర్ కండిషన్ రూమ్‌లో వున్న అతనికి చెమట పోసినట్లయింది. లేచి ఫాన్‌కూడా వేసుకొని కుర్చీలో స్టెడీగా కూర్చొని ఆ వుత్తరాన్ని ఆసాంతం సీరియస్‌గా చదవసాగేడు.

విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగారికి

అయ్యా,

నేను వో బీద మధ్యతరగతి కుటుంబంలో పుట్టాను. కట్నాలిచ్చే స్తోమత మానాన్నకు లేదని తెల్సి పెళ్లిమీద ఆశను ఎన్నడో వదిలేసు కొన్నాను. చదువే నా తపస్సు అనుకున్నాను. టెంత్‌క్లాస్‌లోనే మొదటి దెబ్బ తగిలింది. నేను ఆశించిన మార్కులు రాలేదు. అయినా స్కాలర్ షిప్పుకు అర్హత పొందే మార్కులొచ్చాయి. నా శక్తి సామర్థ్యాలను నేను హెచ్చుగా అంచనా వేసుకొన్నానేమోనని మనసుకు సర్దిచెప్పుకొని ఇంటర్ లో చేరాను. కంప్యూటర్ పుణ్యమో మరెవరి పుణ్యమో తెలియదు కాని మొదట్లో నా నెంబరు పాసయిన లిస్టులో కూడా లేదు. ఆతర్వాత అయిదో పదో మార్కులు కలిపితే పాసయిన వారి లిస్టులో పడ్డాను. తీరా మార్కులొచ్చాక చూచుకుంటే శెకండు క్లాస్ బార్డర్‌లో తప్పిపోయిన అదృష్టవంతుల్లో వున్నాను. నాకు మేస్టర్ల మీద, అధికార్ల మీద, విద్యావిధానంమీద, పరీక్షల పద్ధతిపైన అసలు నామీదే నాకు విశ్వాసం నశించింది. చదువు పట్ల శ్రద్ధ పోయింది. అయినా యింట్లో కూర్చుని ఏం చేయటం?

యమ్. బి. బి. యస్. ఆశయంగా పెట్టుకున్న నేను అలా విధి లేక కచ్చకొద్దీ బి. ఏ. లో చేరేను. "ఎవరి మీద కచ్చ?" అని నన్ను నేను ప్రశ్నించుకొన్నా. "ఎవరిమీద వుండకూడదు కచ్చ?" అని మళ్ళీ ప్రశ్నించు కొని సమాధానం చెప్పుకున్నాను.

పైకిపోవాలంటే చదువు వొక్కటే మార్గం కాదని బి.ఏ.లో చేరాక తెల్సుకున్నాను. అనేకమైన అడ్డదారుల్లో రాజకీయాలు రహదారులు. అబద్దాలాడటం, మోసపు మాటలు చెప్పడం, కుట్రలు కుయుక్తులు చేయటం.... వీటి మెళుకువలు తెల్సుకున్నాను. అయినా జీవితంలో దిగజారిపోయే ముందు వొక్కసారి నన్నింతవరకు పరీక్ష చేసిన వాళ్ళకు వో పరీక్ష పెట్టా లనిపించింది.

మీకు తెలియదేమో-యూనివర్సిటీలో జరిగే స్పాట్ వేల్యూయేషన్ విధానాన్ని గురించి యిక్కడ విద్యార్థులు ఎన్నో తమాషా అయిన కథలు చెప్పుకొంటూంటారు. అలాటివాటిల్లో ముఖ్యమైనది-చూడకుండా టిక్కులు కొట్టి మార్కులేస్తారని. నిజమా? అబద్దమా?

రాయాల్సిన అయిదు పరీక్షలక్కాను వొక్క పరీక్షను బొమ్మాబొరుసుద్వారా నిర్ణయించి, ఆ పరీక్ష కెళ్ళాను.

ఇవాళ నా మార్కుల్లిస్టు వచ్చింది. అది చూచుకొని___

"నాదేశం ఇలా తగలబడిపోతున్నదే" అని బిగ్గరగా ఏడ్చాను!

పరీక్షలపేరిట జరుగుతున్న ఫార్సును తలుచుకొని పగలబడి నవ్వు కొన్నాను!

నాకు నలభై మార్కులు వచ్చాయి!

ఇంత బధ్ధకస్తులూ, బుద్ధివిహీనులా మీరూ?

ఈ కాంపిటేటివ్ వరల్డ్‌లో వొక్క మార్కుకు ఎంత విలువవుందో తెలీదా మీకు? పెద్దపెద్ద డిగ్రీల ముసుగులు కప్పుకొని మేధావులన్న బోర్డులను మొహాలకు తగిలించుకొని పిల్లల జీవితాలతో ఫుట్‌బాల్ ఆట ఆడుకొంటారా మీరు? అదేమంటే రూల్స్ అనే రూళ్ళ కర్ర చూపించి భయపెడ్తారా? యిక రాజకీయపు మనుషులకి మేధావులకి భేదం ఏమిటి?

విద్య పేరిట జరుగుతున్న ఈ అన్యాయాన్ని నేను తీవ్రంగా అతి తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాను.

స్టాప్ దిస్ నాన్‌సెన్స్ ఆర్ ఫేస్ ది కాన్‌సిక్వెన్సెస్?
మీకు పదే పదిరోజులు గడువిస్తున్నాను.
ఈ పదిరోజుల్లో నేనురాసిన ఆన్సర్ పేపర్ చదవండి.
మీ నిర్ణయాన్ని తెలపండి. తెలపక పోయారో—
ఈ వ్యవహారం ప్రజల న్యాయస్థానం ముందుంచుతాను.
ఇది అహంకారమూకాదు, తిరుగుబాటూ కాదు—
ఆవేదన. న్యాయంకోసం పడే తపన-
పదే పదిరోజులు గడువు. గుర్తుంచుకుంటారుగా? ఇట్లు

స్వప్నసుందరి

ఊరిపేరు....

రిజిష్టరు నెంబరు—

తేదీ———

కాలేజీ పేరు—

అయిదు నిముషాల్లో రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, ముఖ్య గుమాస్తా యిత్యాది అధికారులంతా రామ్‌దేవ్ రూమ్‌లో వున్నారు. అందరూ ఆ వుత్తరాన్ని చదివేరు. ఎవరూ రామ్‌దేవ్‌లా సీరియస్ అయి పోలేదు.

"ది లాంగ్వేజ్ యూజ్డ్ బైది కాండిడేట్ ఈజ్ అన్ పార్లమెంటరీ. వుయ్ షుడ్ టేక్ నోట్ ఆఫ్ యిట్ ఫస్ట్."

"అయినా ఇలాంటి బెదిరింపు ఉత్తరాలు కొత్తేంకాదు సార్. ఫెయి లయిన ప్రతివాడూ తను బాగారాసేననే అనుకొంటాడు. యూనివర్శిటీ ఫస్ట్ తనకే రావాలని ఆశిస్తాడు. రాకపోతే తిట్లు, విమర్శలు. వీటన్నిటినీ పట్టించు కుంటే మన వర్కు సఫర్ అవుతుంది.

"నా ఉద్దేశ్యంలో సర్.... ఈ ఉత్తరాన్ని లాడ్జ్‌చేసి పారేయవచ్చు. ఎందుకంటే అభ్యర్థి స్పష్టంగా ఏంకావాలో ఎక్కడా చెప్పలేదు. రీకౌంటింగా? రీవేల్యుయేషనా? ఏదైనా తగు డాక్యుమెంట్సు, ఫీజు కట్టినట్లు చెలాను ఏదీ

జతపర్చబడలేదు. అసలు ఈ కాగితం ఏ సీటుకి చెందుతుందో చెప్పటం కూడా కష్టమే" ముఖ్యగుమాస్తా చివరికి తేల్చేశాడు.

"అవన్నీ తరువాత ఆలోచించాల్సిన విషయాలు. ఒక్క అర గంటలో ఈ కేండిడేట్ ఆన్సర్ పేపరు నా టేబుల్‌మీద వుండాలి.

రిజిస్ట్రారు కంట్రోలర్ వైపు-కంట్రోలర్ ముఖ్య గుమాస్తా వైపు చూశారు.

"యస్ సర్. కానీ ఆ "కన్‌సరన్డ్" గుమాస్తా ఇవాళ లీవులో ఉన్నాడు.

"అయితే మీరు వెతికి పట్టుకురండి."

ముఖ్య గుమాస్తా మొహం ముందు నల్లనయింది. ఆ తర్వాత ఎర్ర నయింది.

*   *   *

తెల్లవారేసరికి వచ్చి వైస్ ఛాన్సలర్‌గారిని స్వయంగా కల్సుకోమన్న కబురు చూచుకొని లెక్చరర్ రామానుజం ఛీఫ్ ఎగ్జామినర్ అయినంతగా సంతోషించాడు.

రామానుజం ఎప్పుడూ తనకు మేలును యితరులకి కీడును శంకిస్తూంటాడు. తను తప్ప మిగతావారంతా అసమర్థులు, లంచగొండులు అని అతని దృఢవిశ్వాసం. తనకి ఛీఫ్ ఎగ్జామినర్‌షిప్ రావాలని కోరిక. ప్రయత్నాల కొరతేంలేదు.

మొన్నటి స్పాట్ వేల్యుయేషన్‌లో తన ఛీఫ్ అతని కళ్ళకు అవినీతిపరుడుగా కన్పించాడు. దానికితోడు ఆఫీసు వాళ్ళు ఈసారి ఛీఫ్ షిప్ నీకు తప్పదు అన్నారు.

"నేను చెప్పినట్లే జరిగింది. చూచావుగా? సెప్టెంబర్ పరీక్షలకు మనం ఛీఫ్" అంటూ భార్యతో చెప్పి హుషారుగా బయలుదేరేడు.

రైలు ఎక్కేసరికి సగం హుషారు వచ్చింది. ఎక్కాక ఛీఫ్ ఎగ్జామినర్ శేషాద్రిని పెట్టెలో చూచాక ఎవరో గొంతు పిసికినట్లు గిజగిజలాడి పోయాడు.

శేషాద్రి రామానుజాన్నే కాదు మరెవర్నీ చూచే స్థితిలో లేడు. వైస్ ఛాన్సలర్‌ని కలవమన్న వార్త వచ్చిన దగ్గరి నుంచి అతని కళ్ళ ముందు "డాక్టర్ డిగ్రీ"యే కన్పిస్తున్నది.

శేషాద్రి సీనియర్ లెక్చరర్. తనకు వున్నది. ఇతరులు పొందితే కుళ్ళి చస్తాడు. తనకు లేనిది యితరులకేమైనా వుంటే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటాడు. అలా వున్నవాళ్ళను ఎగతాళి చేస్తాడు. అది అతని స్వభావం.

అతని జూనియర్లందరికీ డాక్టరేట్‌లు వున్నాయి. "ఈరోజుల్లో డాక్టరేట్లు పొందటం ఎంత సేపోయ్? లీటరు కిరోసిన్ ఆయిల్ సంపాదించే లోగా డాక్టరేట్ కొనుక్కొచ్చుకోవచ్చు."

"పోనీ మీరూ ఒకటి కొనుక్కొని రాకూడదూ?" ఎవరో ఛాలెంజ్ చేశారు.

కొందామని అయిదేళ్ళ క్రితం నుంచి ప్రయత్నిస్తున్నాడు. రికమెండేషన్లు చేయిస్తున్నాడు. స్పాట్ వేల్యుయేషన్‌కి పోయినప్పుడల్లా అతని పని అదే. మొన్న కొత్త వైస్ ఛాన్సలర్‌కి "గట్టి" రికమెండేషనే కొట్టిచ్చాడు. దాని ఫలితమే ఈ పిలుపు?

"ఏం సార్? ఎక్కడిదాకా?" రామానుజమే పలుకరించాడు.

"డాక్టరేట్ వచ్చిందోయ్. చూచొద్దామనీ....నువ్వా?"

"పర్సనల్ పనిలెండి"

యిద్దరూ వొకర్నొకరు చూచుకొని అనుమానపడ్డారు. మనస్సుల్లో మాటలు చెప్పుకోకుండా మాట్లాడుకొన్నారు. "యిప్పుడు యూనివర్సిటీకి

పీడెందుకు వెళ్తున్నట్లు?" అని వుభయులూ తర్కించుకున్నారు. చివరికి యిరువురూ వొకరికి తెలీకుండా వొకరు వొకటే మాటనుకొని అంతరద్దీలో కునుకు కుపక్రమించారు.

"వాడెందుకెళ్తే నాకేం? ఎందుకు పిలిపించినా ఫస్ట్ క్లాస్, టి ఏ., డిఏలు ఇవ్వక తప్పదుగా? చచ్చినవాడిపెళ్ళికి వచ్చిందే జమ."

*　　　*　　　*

రామానుజం, శేషాద్రి, వైస్ ఛాన్సలర్ రూమ్ ముందు కల్సుకున్నారు. చిరునవ్వులు నవ్వుకున్నారు.

"లోపలికి రమ్మన్నారండీ"

యిద్దరూ వొక్కసారే లోపలికెళ్లారు. లాంఛనాలు అయ్యాయి.

వైస్ ఛాన్సలర్.... రిజిస్ట్రార్ .... కంట్రోలర్ .... ఇంటర్వ్యూ బోర్డా?

"శేషాద్రిగారూ, యీ కేండిడేట్‌కు నలబయి మార్కు లొచ్చాయి. కేండిడేట్ వుత్తరం రాసింది. యీ పేపరు మరోసారి చూచి ఎన్ని మార్కు లొస్తాయో చెప్తారా?"

ఎగ్జామినర్‌గా వున్న కాలం నుంచి శేషాద్రికి అన్సర్లు చదివే అల వాటు లేదు. చీఫ్ అయ్యాక అసలు కట్ట విప్పకూడదని శపథం చేశాడు. మార్కుల్సి లిస్టుచూచి ముప్పైమార్కులు వచ్చిన వాళ్ళకు అయిదు కలిపి ముప్పైఅయిదు, అరవై, యాబయి, నలబయిలు వచ్చిన వాళ్ళకి అయిదు తీసేసి యాబయి అయిదు, నలబయి అయిదూ, ముప్పై అయిదు చేయటం అన్న ప్రిన్సిపల్‌ని క్రమం తప్పకుండా నోము పట్టినట్లు ఆచరిస్తున్నాడు. చివరన అయిదు అంకె వచ్చేలా చేస్తే తనకు అదృష్టం వస్తుందని అతని నమ్మకం.

వైస్ ఛాన్సలర్ నుంచి అన్సరు పేపరు తీసుకొని మార్కులు

చూచాడు. ఎఱ్ఱ యింకుతో ముప్ఫైమూడు వేసివుంది. ముందు తను పచ్చ యింకుతో ఆ అంకెను ముప్ఫైఅయిదు చేసి, ఆ తర్వాత ఏ కారణంచేతనో మరి నలబయి చేసేడు.

"అంటే లోపల అన్సరు ఏదన్నా పొరపాటున చూచి బాగుందను కొన్నానేమో!"

అనుభవం అతనికి ఆక్షణంలో తమను ఎందుకు పిలిపించారో చెప్పింది. ఖచ్చితంగా ఇది రీవేల్యుయేషన్ కేసే. ఏ యాబయి అరవై మార్కులు రావాల్సిన కేండిడేటో పాపం! ఆ రామానుజం చూడకుండా టిక్కులు కొట్టి ముప్ఫైమూడు తగలేసేడు. "అర మార్కులు వెయ్యి వద్దయ్యా" అని ఎంత మొత్తుకొన్నా వినడు. తన స్వంత అబ్బగాడి సొమ్ము యిస్తున్నట్లు ముక్కి ముక్కి మార్కులు వేస్తాడు.

అదృష్టం! తనతప్పేంలేదు. ఎగ్జామినర్ వేసినమార్కులకి ఏడు మార్కులు కలిపేడు తను. తన కేం మాట రాదు. ఏమొచ్చినా ఆ రామానుజంగాడి మెడకే. కానీ యిప్పుడు తను ఆపేపరుకు యాబయి మార్కులు వస్తాయంటే రామానుజంగాడి కొంపేకాదు తన కొంపా మునుగుతుందే? కనుక తను వేసిన మార్కులమీదే తను ఘట్టిగా కూర్చోవాలి. అలా కూర్చొని వీలైతే ఛీఫ్ షిప్‌కోసం కలలుకంటున్న రామానుజం గాడిని దెబ్బ కొట్టాలి. చూస్తాడుగా తన తడాఖా ఏమిటో?

అలా ఆలోచిస్తూ అన్సర్లు చదువుతున్నట్లు చేసి నటనను ముగించాడు శేషాద్రి. లోపలవున్న ఒక్క అక్షరం అతని కంటపడలేదు.

"సార్, కేండిడేట్ అన్సర్లు బాగా రాసింది. అయినా పేపర్లో చాలా "ఇర్రెలెవెంట్" మేటరు వుంది. అంచేత నలబయి, నలబయిఅయిదు మార్కులకన్నా ఎక్కువ అవకాశం ఏమాత్రం లేదు. అందుకే ఎగ్జామినర్ ముప్ఫైమూడు వేసి కేండిడేట్‌ని తప్పించినా నేను జాగ్రత్తగాచూచి నల

జయి మార్కులు వేసేను. అసయి నలబయి అయిదు దాకా వేద్దామను కొన్నాను కాని నా చేతిలో వుంది పది మార్కులే గదా? అందులో ఏడు మార్కులు వేసేను. యింక అంతకన్నా నేనేం చేయగలను చెప్పండి. అప్పటికీ వేల్యుయేషన్ సమయంలో "బీ—లిబరల్....బీ-లిబరల్" అని నెత్తి నోరు కొట్టుకొని చెపుతూనే వుంటాము. కావాలంటే...."

"మిస్టర్ శేషాద్రీ అయామ్ సారీ. కేండిడేట్ తనకి రావాల్సిన మార్కుల కన్నా ఎక్కువ వచ్చాయని కంప్లయింట్ చేసింది."

శేషాద్రి గుండె గుభేలుమంది. అయినా సీనియర్ లెక్చరర్ కదా?

"వాళ్ళమొహం. ఈ కాలంలో విద్యార్థులకి తామేం రాసిందీ తమకి తెలిస్తే కదా? ఓవర్ ఎస్టిమేషన్....అండర్ ఎస్టిమేషన్. ఈ కేండిడేట్‌కు తప్పక నలబయి మార్కులు వచ్చితీరాలని నా ధృఢ అభిప్రాయం"

"మీరేమంటారు మిస్టర్ రామానుజం"

ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్నాడు రామానుజం. అతడి గుండెలు ధరల్లా మండిపోతున్నాయి. వీడు....ఈ జాకాల్ గాడు అవకాశం దొరికిందికదాని తన ఎదటే తనకు ఎసరు పెట్టబోయాడు. యిక తను వాడిని క్షమిస్తాడా? స్మేష్....ఈ దెబ్బతో వాడి ఛీఫ్ షిప్పే కాదు-అసలు ఎగ్జామినర్ షిప్పే గోవిందా?—

అనుకొంటూ అతను పేపరు అందుకున్నాడు. ఆన్సర్లు చూస్తున్నట్లు సీరియస్‌గా నటించసాగాడు. అలవాటు కొద్దీ పెన్‌తీసి టిక్కులు కొట్టబోయాడు కూడా! కానీ అలవాటు మార్చుకొని ఆన్సర్లు మాత్రం చదవలేదు. ఏంచెప్పాలో ఆలోచించాడు.

"సార్ నిజానికి ఈ పేపరుకు ఇరవైఅయిదు మార్కుల కన్నా ఎక్కువ రాకూడదని వొప్పుకుంటున్నాను. కానీ ఛీఫ్‌గారు "బీ లిబరల్.... బీ లిబరల్" అని అస్తమానం పోరుతుండటంవల్ల ఆ మాత్రం లిబరల్‌గా

వేల్యూ చేయక తప్పలేదు. ఎలాగూ ఫెయిలయ్యే కేండిడేటే కదా అని ఇరవై అయిదు రావాల్సిన కేండిడేట్‌కు ముప్పైమూడు వేసేను. అంత కన్నా వొక్కమార్కుకైనా ఆకేండిడేట్‌కు అర్హత వున్నదని నాకు తోచి నట్లయితే నేనే ముప్పై అయిదు వేసివుండేవాడిని. ఛీఫ్‌గారు నలబయి మార్కులు ఆ కేండిడేట్‌కు వేస్తారని నేను వూహించలేదు. ఆయన నాకు చెప్పనూలేదు.

ఆ ఆన్సర్ పేపరు తిరిగి రామ్‌దేవ్ బల్లమీదికి చేరింది. అతను ఆన్సర్లనే చూస్తున్నాడు. అక్షరాలు... కొన్ని వందల....వేల అక్షరాలు న్నాయి ఆ ఆన్సర్ పేపర్‌లో. ఆ అక్షరాలన్నీ విద్యార్థినీ—విద్యార్థులుగా రూపాంతరం చెందేయి. రామ్‌దేవ్ మీదికి పెన్నులు బల్లేలుగా ధరించి వాళ్ళంతా మూకుమ్మడిగా వస్తున్నారు.

"నాన్సెన్స్. ఐ కెనాట్ టాలరేట్ దిస్ ఇన్‌టెలెక్చ్యుయల్ ఇమ్మొరేలిటీ. వుయ్ ఆర్ ఆల్ సిన్నర్స్ మనమంతా పావులం" ఆవేశాన్ని ఎంత ఆపుకుందామన్నా ఆగక రామ్‌దేవ్ ఆవేశంగా అరిచేడు.

"మీరు క్షమించరాని నేరంచేసేరు. మీ నేరమేమిటో మీరే తెల్సుకొని పొండి. మీరు అప్పుడూ ఇప్పుడూ కూడా చదవకుండా వేల్యూ చేసిన ఆన్సర్లని నేను చదువుతాను అంతా వినండి."

భయంకరమైన నిశ్శబ్దం. వో క్షణం భీకరమైన సస్పెన్సు!

సింధూనాగరికత వర్ణించమన్న ప్రశ్నకు జవాబు మచ్చుకు కొన్ని ముక్కలు.

"సింధూనాగరికత ఎలా చస్తే మనకేం మాస్టారూ? ఉట్టి కెగర లేనమ్మ స్వర్గానికి ఎగ బ్రాకిందట! యివాళ మన నాగరికత ఎలా ఏడుస్తుందో మీకు తెలుసా? హిపోక్రసీ, మోసం, అవినీతి, ఆశ్రితపక్షపాతం, ఆలసత్వం, లంచగొండితనం....యిప్పటి మన నాగరికత లక్షణాలు. పనికి

మాలిన వాళ్ళంతా పాలకులయి పోతున్నారు. అధికారులంతా వాళ్ళ బూట్ల కాళ్ళు నాకుతున్నారు. సింధు నాగరికతట! అసలు నాగరికత అనే పదాన్ని ఉచ్చరించే అర్హత వుందా? మన తాతలు నేతులు తాగేరు. వాళ్ళ మూతులు మనం నాకుదాం. నాన్సెన్స్, యిది ఏ ధోరణి? మేస్టారూ—అటు చూడండి. విప్లవం వస్తోంది. రక్తపాతం జరుగుతుంది. మీ నాగరికత సమూలంగా నాశనమవుతుంది. ఆ తర్వాత ఏం జరుగుతుంది? యాదవ కులంలో ముసలం! ఖబడ్దార్ భారతీయుడా, "అటు శతృవు-ఇటు శతృవు-ఇటు లటు లెటుచూచిన శతృవులే-నీ నీతే నీ శతృవు—మేలుకోరా మిత్రుడా—దోచుకుపోరా జనాన్ని" "సింధూ, హిందూ ఎందుకు? ఇందూ అందూ వెతక్కు, మందూ, బొందూ మానకు, భంగూ, భుంగూ, బొంగూ వీడకు.

మౌర్యుల కాలంనాటి ఆర్థిక పరిస్థితికి ఆన్సర్లుగా యీనాటి దోపిడీ ఆర్థిక వ్యవస్థను గూర్చి వ్రాసింది. యీనాటి సాంఘిక దురాచారాలను ఖండించింది. మధ్యలో వో చెణుకు—

"మాష్టారూ మీరు ఆడా మగా? ముసలాళ్ళా వయసువాళ్ళా? పెళ్ళయిందా, బ్రహ్మచారులా? నేను పెళ్ళికానిపిల్లను, కట్నం ఇవ్వను. నాకు పెళ్ళి చేయించగలరా? ఈకాలపు దురాచారాలు మాన్పటంలో మీ పాత్ర మీకు తెలియదుకాని మౌర్యుల కాలంనాటి సాంఘికాచారాలమీద క్వొశ్చన్లు-ఆన్సర్లు! దర్టీ విద్యావిధానం—"

బుద్ధుడిని గురించిన ప్రశ్నకు సమాధానంగా "బుద్ధం శరణం గచ్ఛామి" అధర్మం శరణం గచ్ఛామి, ధనం శరణం గచ్ఛామి, మోసం శరణం గచ్ఛామి అంటూ మూడు పేజీలు దండకం రాసింది.

కృష్ణదేవరాయల సంస్కృత సేవకు ఆన్సర్‌గా ఈనాటి సాహిత్య ధోరణులను దుయ్యబట్టింది. అందులో ఓ బిట్—

"అ-స్థాన కవులు

ఈ-స్థాన కవులు

ఏ, ఏ-స్థానిక కవులయితేనేం?"

సాహిత్యాన్ని రాజకీయవేత్తలకు తార్చే వుంపుడుగాశ్శేగా అంతా?

కాంగ్రెసు, కమ్యూనిస్టు, జనతా, విప్లవం, దిగంబరం, శ్వేతాంబరం, కాలాంబరం....కాముకాంబరం....ఏ రాయైతేనేం పళ్ళూడగొట్టుకోడానికి. సాహిత్య సామ్రాట్టులూ....రాజకీయ నాయకులకు మీరే ఇరవయ్యేవ శతాబ్దపు భట్రాజులు! ఇక సంస్కృతేమిట్ట" వెర్రి ముండాకొడుకులు-వెర్రి ప్రశ్నలు! అన్నట్లు నిద్రపోతూ పేపరు దిద్దే ఓ మేష్టారూ—శంకరాభరణం సినిమా చూచారా? ఎన్నిసార్లు చూచేవు? నేను పదిసార్లు చూచానంటే నమ్ముతారా? దాన్ని గురించి కొశ్చన్ అడగరెందుచేత? అసలు మీకు ఆ సినిమా అర్థమయిచస్తేకదుట్లే-!

అల్లావుద్దీన్ ఖిల్జీ దండయాత్రల్ని గురించి రాయమంటే - రష్యా, చైనాల మధ్యన శతృత్వం గురించి వ్రాస్తూ—

"రెండూ కమ్యూనిష్టు దేశాలే. కార్మిక నియంతృత్వం కోసం పోరాడి అధికారాన్ని హస్తగతం చేసుకొన్నవే. అయినా చిన్న పిల్లల్లా దారుణంగా కొట్టుకుంటున్నాయ్, తిట్టుకొంటున్నాయ్-ఎంచేతంటారు? ఈ ప్రశ్నకు సమాధానం తెల్సీ చెప్పకపోయారో తల పగిలి చస్తారు.

చదవటం ఆపి రామ్‌దేవ్ అందరివైపు చూచేడు. తల పగలగొట్టుకు చచ్చే ఆలోచనలతో ఎవరూ వున్నట్లు కన్పించలేదు. ఎంతయినా మేధావులుకదా మరి!

*                    *                    *

స్వప్న సుందరి పెట్టిన పది రోజుల గడువు దగ్గర పడేకొద్దీ రామ్‌దేవ్‌కు టెన్షన్ పెరిగింది. అసలు సమస్యకు సాల్వేషన్ కనుచూపు

మేరలో కన్పించడం లేదు. అప్పటికీ అధికార, అనధికారులతో, విద్యా వేత్తలతో ఓ కమిటీని వేసేడు. ఆ కమిటీ చాలా రోజులుగా ఈ విషయాన్ని చర్చిస్తోంది. మొదటి రోజు చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్తున్నారు. తలకొక అభిప్రాయం. తమ అభిప్రాయమే మంచిదని అందరి నమ్మకం. ఇంకొకరి అభిప్రాయాన్ని చస్తే వొప్పుకోరెవరూ.

"దిస్‌యీజ్ రిడిక్యులస్. ఎగ్జామినర్‌ని, ఛీఫ్ ఎగ్జామినర్‌ని వెంటనే పర్మినెంటుగా డిబార్ చేస్తే సరి" వో ఆఫీసర్‌గారి ప్రతిపాదన.

"అందుకు నేనంగీకరించను! యిది మేస్టర్లకి సంబంధించిన ప్రిస్టేజ్ సమస్య. అసలు ఈస్పాట్ వేల్యుయేషన్ సిస్టంని ప్రవేశపెట్టమని మేస్టర్లు కోరేరా? రోజుకు యిన్ని పేపర్లు, వో జైలు లాంటి చోట కూర్చుని దిద్దాలన్న నిర్ణయాన్ని, యూనివర్సిటీ టీచింగ్ కమ్యూనిటీని అడిగేచేసిందా? టీచర్స్ సమస్యలు టీచర్సుకి వున్నాయి. నిజానికి తప్పు యూనివర్సిటీది. ఆ తప్పును కవర్ చేసుకోటానికి టీచింగ్ కమ్యూనిటీని "ఇమ్మోరలైజ్" చేసే ఏ చర్యనైనా నేను యిక్కడా బయటాకూడా ప్రతిఘటిస్తాను." టీచర్ల వోట్లతో సిండికేట్ మెంబరైన వో ట్రేడ్ యూనియనిస్టు వాదన.

"ఏమిటండి మీపిచ్చి? మేస్టర్లు వేరు యూనివర్సిటీ వేరూనా? టీచర్లు లేకపోతే యూనివర్శిటీ ఏమిటండీ? నిజానికిది టీచర్లకు, యూనివర్శిటీకి కూడా ప్రిస్టేజ్ సమస్యే. వో ఆడపిల్ల బెదిరింపులకు లొంగిపోవటమే! నన్నడిగితే ఆ పిల్లను పరీక్షకు కూర్చోకుండా పర్మనెంట్‌గా డిబారు చేసి పారెయ్యాలి. విద్యార్థుల్లో డిసిప్లెన్ పోతే ఎలాగండీ? వుయ్ మస్ట్ బీ వెరీ స్ట్రిక్టు. యిలా అడ్డమైనవాళ్ళ బెదిరింపులకి లొంగితే రాజ్యం చేసినట్లే. మీకెందుకు పదేళ్ళు మినిస్టరు చేసిన అనుభవంతో చెప్తున్నాగా, ఆ పిల్లను డిబారు చేసెయ్యండి" రాజకీయంగా చాలా "దూరం" ఆలోచించి ఘాటుగా అన్నాడా రాజకీయపు పెద్దమనిషి.

"విద్యార్థుల నుంచి అలజడి వస్తుందేమోనండీ! ఈ పేరుతో ఎవ రైనా ఆందోళన లేవదీస్తారేమో!" ఓ కాలేజీ ప్రిన్సిపల్‌గారి సందేహం.

"మంచిదే కదండీ. మీ మేస్టర్లు పాఠాలు చెప్పకుండా హాయిగా ఇళ్ళల్లో కూర్చోవచ్చు. అదేదో రానీయండి అప్పుడు చూద్దాం. ముందే భయాలు, అనుమానాలు ఎందుకు?"

"నేననేది....విద్యార్థుల శక్తిని మనం తక్కువగా అంచనా వెయ్యకూడదని."

అటు మేస్టర్లనీ, ఇటు యూనివర్శిటీని, మరోవైపు విద్యార్థులనీ.... ఎవరినీ నొప్పించకూడదు. ఎవరి ప్రిస్టేజ్‌కి లోపం ఉండకూడదు. మరి ఈ సమస్యకు పరిష్కారం ఎలా?

ఓ ప్రొఫెసర్‌గారు గొంతు సవరించుకున్నాడు. ఆయన సబ్జక్ట్ ఏదైనా, ఆయనకు మనస్తత్వ శాస్త్రంలో మంచి ప్రవేశం వుంది. అంతా వుత్సుకత ప్రదర్శించారు.

"ఈ సమస్యను మనం సైకలాజికల్‌గా ఆలోచిస్తే మంచిదేమో! అభ్యర్థి ఆన్సర్లు చదివినా, అప్లికేషన్ చదివినా వొక్క విషయం స్పష్టమవుతోంది. ఆమె చాలా ఆవేశపరురాలు. కానీ, ఆ ఆవేశానికి మూలకారణం ఏమిటని ఎనలైజ్ చెయ్యాల్సిన అవసరం వుంది. గత పరీక్షల అనుభవాలవల్ల మానసికంగా ఆమె కృంగిపోయింది. తీవ్రమైన నిరాశానిస్పృహలకు లోనయింది. ఆ నిరాశానిస్పృహలను తొలగిస్తే ఈ ప్రాబ్లమ్ సాల్వు అయినట్లేగదా?

"ఆ నిరాశానిస్పృహలకు మన బాధ్యతేం లేదుకదా? ఇంటర్మీడియట్ బోర్డుకు ఫైలు ట్రాన్స్‌ఫర్ చేసేద్దాం" ఆఫీసర్‌గారు హుషారుగా అన్నారు.

"మా మిత్రుడు, సైకాలజీ ఎక్స్‌పర్ట్ చెప్పినదానిలో సత్యం కనిపిస్తున్నది. అందుకు ప్రమాణం అభ్యర్థి రాసిన ఆన్సర్లే. చరిత్ర ప్రశ్నలకు

ఆ సమాధానాలు సందర్భోచితంగా కన్పించకపోయినా, సూక్ష్మదృష్టితో పరిశీలి స్తే అభ్యర్థికి సమకాలీన రాజకీయ సాంఘిక ఆర్థిక సాహిత్య సాంస్కృతిక రంగాలలో గల అవగాహన అచ్చెరువు కలిగించేదిలా వుంది. ఇలాంటి విద్యార్థులే ముందు ముందు ఈ వ్యవ స్థ మార్పుకు దోహదం చేయగలరు. అంచేత....

అంటూ ఆగేడు ఆయన. ఆయన యూనివర్శిటీ ప్రొఫెసరే. అసలు సబ్జెక్ట్‌లో రీసెర్చ్ ఏం చేసేడో తెలియదు. కానీ తీవ్రభావాలుగల రాజకీయ సిద్ధాంతాలకు ఆయన కేంద్రబిందువు. సైద్ధాంతికుడు. నిత్యరీసెర్చియుతుడు.

"అంచేత మనం ఇప్పుడు ఓ విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవల్సి వుంది. అభ్యర్థి ప్రస్తుత విద్యావిధానాన్ని, పరీక్షల పద్ధతుల్ని తీవ్రంగా విమర్శించింది. ఆమె విమర్శను మనమూ సూత్రప్రాయంగా అంగీకరిస్తూ-సమకాలీన రంగాలలో ఆమెకు గల లోతైన అవగాహనకు మెచ్చి ఫస్ట్ క్లాస్‌లో పాసు చేయాలని నా ప్రతిపాదన.

అంతా ఉలిక్కిపడ్డారు ముందు! ఆ తర్వాత ఆ ప్రతిపాదనను కొందరు విమర్శించారు. మరికొంతమంది బలపరిచేరు. ఆవేశాలు పెరిగేయి. వ్యక్తిదూషణలకు దిగేరు.

రామ్‌దేవ్‌కి పిచ్చెక్కినట్లయింది. నిర్మాణాత్మకంగా ఆలోచిస్తారని వీళ్ళందర్నీ రప్పిస్తే యిదేమిటి? కుస్తీపట్లకు దిగేలా వున్నారే?

"సార్. మన యూనివర్శిటీలో ముప్ఫైఏళ్ళ అనుభవంగల ఓ గుమాస్తా వున్నాడు సార్. ఈ సమస్యకు పరిష్కారం అతనుతప్ప మరెవరూ చెప్పలేరు. అతడిని పైలిచేస్తే? రూల్సును ఇన్‌టర్‌ప్రెట్ చేయటంలో అతని ప్రజ్ఞకు మెచ్చి గౌతమ, కానాడఋషి, కపిల, జైమిని, బాదరాయణ, పాణిని, యాజ్ఞవల్క యిత్యాదినామాలతో అతడిని పిలుస్తుంటారు ఆఫీసులో జనం. అన్ని పేర్లల్లో "పాణిని" అన్న పేరు స్థిరపడిపోయిందిప్పుడు. పిలిపించమంటారా?"

కమిటీ మీటింగ్ అయ్యాక ఆ సాయంకాలం పాణిని వైస్ ఛాన్స లర్‌ని ఏకాంతంగా కలిసేడు. అంతా విని మహాఋషిలా చిరునవ్వు నవ్వేడు పాణిని.

"చిన్న విషయం చాలాదూరం వచ్చేసింది సార్. యిప్పుడు మీరు ఏ నిర్ణయం తీసుకొన్నా వ్యతిరేకించే వారుంటారు. వైస్ ఛాన్సలర్ పైన ఛాన్సలర్ వున్నాడుగా! ఆయనకు మొత్తం విషయం "రెఫర్" చేస్తే గొడవ వుండదు. ఏమంటారు?"

చిత్రం! ఏ విషయం పైన కలవని కమిటీ సభ్యులు, వైస్ ఛాన్సలర్ యీ ప్రతిపాదన చేయగానే ఏకగ్రీవంగా అంగీకరించారు!

* * *

ఛాన్సలర్‌గారు రామ్‌దేవ్ చెప్పిందంతా శ్రద్ధగావిన్నట్లు కనబడ్డారు. అతను యిచ్చిన కాగితాలను నవ్వుతూ తీసుకొని పరిశీలించారు. అర్జంట్ ఏక్షన్ తీసుకునే నిమిత్తం వెంటనే స్పెషల్ మెసెంజర్ ద్వారా ప్రభు త్వానికి ఫార్వర్డు చేయమని ఆర్డరు జారీ చేసేడు!

* * *

ఆ రోజుతో స్వప్నసుందరి పెట్టిన గడువు పూర్తవుతుంది. మూడు రోజులుగా మంత్రి మండలి సమావేశం వాయిదా పడి పడి ఆవేళ సమా వేశమయింది. రామ్‌దేవ్ చెప్పినదంతా సావధానంగా విన్నది. అతడిని బయటికి పంపించి చర్చకు కూర్చుంది. ఎజెండాలో ఆ అంశానికి అరగంట కాలం మాత్రమే కేటాయించబడివుంది. అందులో యిరవై నిముషాలు అయ్యేపోయింది. అయినా చర్చించటానికి యిందులో ఏముంది? స్వల్ప విషయం!

"యీ అమ్మాయి ఎవరో విద్యారంగంలో కన్నా రాజకీయ రంగంలో బాగా రాణించే లక్షణాలు నాకు బాగా కన్పిస్తున్నాయి.

ఆ పిల్లను అలా వదిలేస్తే ప్రభుత్వానికి తల నొప్పిగా పరిణమించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఆ కవిత్వం, ఆ రాతలు చూచారుగా? ఆ తెలివితేటలను, వుద్రేకాన్ని, మనకు అనుకూలంగా వుపయోగించు కోవాలి. లేకపోతే వాటిని చంపేయాలి. ఏది చెయ్యాలన్నా ఆ అమ్మాయికి వెంటనే ఏదో పదవి యివ్వవల్సి వుంటుంది. రేపు మనం స్థానిక పాలనా ఎన్నికలు జరపబోతున్నాముగా? ఆ పిల్లకు వో టిక్కెట్టు ఇచ్చేస్తే సమస్య సాల్వు అయిపోతుంది. "లాయల్టీ" టెస్టులో పాసయ్యాక అంతగా అవసరం అనుకుంటే విద్యా సంస్కరణలకు వో కార్పొరేషన్ ఏర్పాటు చేసి దానిలో మెంబరుగానో, చైర్మన్‌గానో చేద్దాం. అన్నట్లు ముందుగా, ఆమె యస్టీనో, యస్సీనో, బీసీ ఆర్ వోసీనో తెల్సుకోమని కలెక్టరుకు ఆదేశాలివ్వాలి. ఏమంటారు? ప్రస్తుతానికి యీ మేరకు నిర్ణయం తీసుకొన్నట్లేగా?"

చప్పట్లు....హర్షధ్వానాలు....! ఎజెండాలో తర్వాత అంశానికి కదిరింది మండలి!

* * *

విద్యా సంస్కరణలు చేయటంలో వైఫల్యఫలితంగా వైస్ ఛాన్సలర్ రామ్‌దేవ్ రాజీనామా—కారణాలను గురించి పలువురు ప్రముఖుల వూహాగానాలు."

పత్రికల్లో ఈ వార్త చదివి ప్రజలు రకరకాల తర్జన భర్జనలు చేసేరు.

రాబోయే వైస్ ఛాన్సలర్ ఎవరన్న విషయంపై యూనివర్సిటీ మొత్తం—"గెస్సింగ్"లతో నిండిపోయింది.

మంత్రిమండలి ఆ వార్త విని నవ్వుకొన్నది.

రామానుజం, శేషాద్రి కల్సి సమిష్టిగా పార్టీ సెలబ్రేట్ చేసుకున్నారు.

మరి ఈ వార్త చదివి స్వప్నసుందరి ఏం చేసింది? మంత్రిమండలి నిర్ణయాన్ని అమలు జరపటంలో సహకరించిందా? లేక....

ఆమె తీసుకొనే నిర్ణయం మీద ఆమె చేయబోయే చర్యలమీద, యీ కథ అసలు ముగింపు ఆధారపడివుంది. అంచేత ఆమె అడ్రస్ పట్టుకొని వెళ్ళకతప్పలేదు. వెళ్తే ఆమె ఇంట్లోలేదు. ఢిల్లీ, హైదరాబాద్‌ల కెళ్ళిందో, ఎలక్షన్ ప్రచారాల కెళ్ళిందో, యూనివర్శిటీ కెళ్ళిందో లేక విప్లవశక్తుల్ని సమీకరించటానికే వెళ్ళిందో వివరాలు తెలియలేదు.

ఆమె ఎక్కడికెళ్తేనేం? ఏంచేస్తేనేం?

స్వప్నసుందరి స్థానంలో మీరే వున్నారనుకోండి. అప్పుడు మీరేం చేస్తారు!

ఇది మీకు పరీక్ష కాదు. ఈ జాతికి, దేశానికే పరీక్ష!

("స్వాతి" మాసపత్రిక 1982)